కాంగ్రెస్ ఖతమైనట్టే!

ఆగస్టు 15న రుణమాఫీ మోసం పార్ట్-2

ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీ సహకారం • రేవంత్‌రెడ్డి ఉద్దెర కథలు ప్రజలు నమ్మరు

దేశంలో బీజేపీకి 220 సీట్లకు మించి రావు • బీజేపీని నిలువరించేది బీఆర్ఎస్ ఒక్కటే

కేసీఆర్‌ను ప్రజలు గుర్తుచేసుకోని రోజులేదు • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గడ్డుకాలం ఎదుర్కొంటున్నదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన పార్లమెంటు పరిధిలోనే గింగిరాలు తిరిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పర్యటిస్తున్న ఆయనకు క్షేత్రస్థాయి పరిస్థితులు అర్థమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతృప్తిగా లేదన్న కేటీఆర్, ప్రజలు నిత్యం కేసీఆర్‌ను తలచుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన అభయహస్తం వారికి భస్మాసుర హస్తం కానుందని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దేశంలో బీజేపీని ఎదుర్కొంటున్నది ప్రాంతీయ పార్టీలేనని, కాంగ్రెస్‌కు దానిని ఎదుర్కొనే సత్తా లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 220 సీట్లు దాటే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయాలను కేసీఆర్ శాసించాలంటే బీఆర్ఎస్‌ను 10-12 స్థానాల్లో గెలిపించాలని ప్రజలను కోరారు.

ఆగస్టు 15 రుణమాఫీ మోసం పార్ట్-2

రేవంత్‌రెడ్డి మాటమీద నిలబడే వ్యక్తి కాదని, ఆగస్టు 15 లోపు రుణమాఫీ అని చెప్పడం మోసం పార్ట్-2లో భాగమని కేటీఆర్ విమర్శించారు. ఆయనకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అర్థమైంది కాబట్టే ఆయన తన సొంత నియోజకవర్గం మహబూబ్‌నగర్‌కు పదిసార్లు వెళ్లారని ఎద్దేవా చేశారు. ప్రజల మూడ్ మారిందని, కాంగ్రెస్‌కు గడ్డుకాలం మొదలైందని చెప్పారు. సీఎంవి అన్నీ ఉద్దెర మాటలేనని, బస్సు ఉద్దెర, సిలిండర్ ఉద్దెర, కరెంటు కూడా ఉద్దెరేనని.. ఇప్పటి వరకు ఎవరి ఖాతాలోనూ రూపాయి కూడా పడలేదనని తెలిపారు. రూ. 4 వేల పింఛన్, ఆడబిడ్డలకు రూ. 2500, రూ. 500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, కౌలు రైతులకు భరోసా, నిరుద్యోగులకు రూ. 4వేల భృతి, ఫ్రీ స్కూటీ, తులం బంగారం వంటివి అతీగతీ లేకుండా పోయాయని, ఉన్న రైతుబంధుకు కూడా దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకసారి మోసపోతే అది మోసం చేసినవాడి తప్పని, రెండోసారి కూడా అదే వ్యక్తి చేతిలో మోసపోతే అది మన తప్పు అవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు మోసం పార్ట్-1లో భాగంగా రుణమాఫీ డిసెంబర్ 9న రిలీజ్ అన్నారని, ఓట్లు వేయించుకుని గట్టెక్కాక.. మోసం పార్ట్-2లో భాగంగా రుణమాఫీ ఆగస్టు-15 అంటూ కొత్త మోసానికి తెరతీశారని మండిపడ్డారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని రెండుసార్లు చెప్పి మాట నిలుపుకోలేదని కేటీఆర్ గుర్తుచేశారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్. చిత్రంలో సత్యవతి, మాగంటి, శ్రవణ్ తదితరులు

> మహబూబ్‌నగర్, చేవెళ్ల ఇన్‌చార్జిని తానేనని రేవంత్ తొలుత ప్రకటించుకున్నారు. రెండు చోట్లా పరాజయం పక్కా అని తేలిపోవడంతో ఇన్‌చార్జ్‌గా తప్పుకున్నారు. భట్టి విక్రమార్క కూడా రెండు సీట్లకు ఇన్‌చార్జిగా ఉండగా ఆ తర్వాత తప్పుకోవడంతోనే పరాజయం ఓటమి తేలిపోయింది. -కేసీఆర్

ప్రజలు నమ్మేది బీఆర్ఎస్‌నే

చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరిలో తాము బలంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రజలు బీఆర్ఎస్‌నే నమ్ముతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మార్పు మొదలైందని, ప్రజలకు కాంగ్రెస్ తత్వం బోధపడిందని చెప్పారు. మైనార్టీ నుంచి ఒక్క మంత్రి కూడా లేరని, రంజాన్ తోఫా లేదు, క్రిస్మస్ కానుక లేదని ఆవేదన వ్యక్తం చేశారు.46 లక్షలమంది ఆసరా పింఛన్‌దారులకు చేయూత అని చెయిచ్చారని ఆరోపించారు.100 రోజుల్లో 1.67 కోట్లమంది ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500 ఇస్తామని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయకుంటే ఫ్రీ బస్సు పథకాన్ని ఎత్తివేస్తామని ప్రజలను ముఖ్యమంత్రి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు.

20 సార్లు అన్నా.. సప్పుడు లేదు

ఇఫ్తార్ విందులో సీఎఎ, ఎన్ఆర్‌సీపై మీ వైఖరేంటో చెప్పాలన్న అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నకు రేవంత్ ఒక్క మాటా మాట్లాడలేదని, రేవంత్ బీజేపీలోకి జంప్ అవుతాడంటూ తాను 20సార్లు అంటే దాని పైనా స్పందించడం లేదని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి మార్చి 15కు వంద రోజులు అయ్యాయని, ఆగస్టు 15 నాటికి 250 రోజులు అవుతాయని, అప్పటికీ హామీలు అమలు చెయ్యవా? అని ప్రశ్నించారు. హరీశ్ కూడా అదే అడిగారని, రేవంత్‌కు సత్తా ఉంటే స్పందించాలని కోరారు. రేవంత్ రుణమాఫీ నేతిబీరకాయలోని నెయ్యిలాంటిదేనని ఎద్దేవా చేశారు. మోదీని రాహుల్‌గాంధీ చౌకీదార్ చోర్ అంటారని.. చౌకీదార్ చోర్ హమారే బడే భాయ్ అని రేవంత్ అంటారని, ఆయన ఎవరి కోసం పనిచేస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

కేసీఆర్‌ను గెలిపిస్తే మోసగాళ్లకు బుద్ధి

2014లో బడే భాయ్ బడా మోసం చేస్తే, 2023లో చోటే భాయ్ కూడా బడా మోసం చేశారని కేటీఆర్ విమర్శించారు. ఈ మోసగాళ్లకు బుద్ధి చెప్పేందుకు కేసీఆర్‌ను తిరిగి గెలిపించాలని కోరారు. మోదీ తెలంగాణ పుట్టకనే అవమానించారని, ఒకటికి పదిసార్లు విషం చిమ్మారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్యాస్ నుంచి డీజిల్ పెట్రోలు వరకు అన్ని ధరలు పెంచేసి మోదీ దేశ ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా చమురు ధరలు మాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు జనామోదం, క్యాడర్ ఆమోదం లేదని తెలిపారు. వరంగల్‌లో కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకోగానే మూడో స్థానంలోకి వెళ్లారని అన్నారు. బీఆర్ఎస్‌ను గెలవనివ్వకుండా చేయడమే కాంగ్రెస్, బీజేపీ లక్ష్యమని, అందుకు ఆ పార్టీలు కొన్ని స్థానాల్లో నిలబెట్టిన అభ్యర్థులే సాక్ష్యమని పేర్కొన్నారు.

> బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లినవారు అక్కడ కంఫర్ట్‌గా లేరు. కాంగ్రెస్‌లోకి వెళ్లినవారు రేవంత్‌తో డీల్ చేసుకుని వెళ్లారు. పార్టీ మారిన నాయకుల పరిస్థితి ఏమిటో ఎన్నికల తరువాత బయటపడుతుంది. కేసీఆర్ పక్కన కూర్చునే కేకే కాంగ్రెస్‌లో ఎక్కడా కనిపించడం లేదు. పార్టీని విడిచి వెళ్లిన వారి వల్ల కొంత నష్టం జరిగిన మాట వాస్తవమే. -కేటీఆర్

బస్సుయాత్రకు బ్రహ్మరథం

కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ 10-12 స్థానాల్లో గెలిస్తే రాష్ట్ర రాజకీయాల్లో చాలా మార్పులు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గట్టిగా కష్టపడితే 12 స్థానాలు గెలుచుకోవడం కష్టం కాదని తెలిపారు. ప్రజలు విజ్ఞతతో ఓట్లు వేయాలని కోరారు. రేవంత్ ప్రభుత్వంలో కమ్మ, ముదిరాజ్, మాదిగ, మైనార్టీ వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని, ఆయా వర్గాలకు సీట్లు ఇవ్వలేదని కేటీఆర్ గుర్తుచేశారు. బీఆర్ఎస్ మాత్రం సామాజిక సమతూకం పాటించిందని తెలిపారు. ఏ వర్గాన్నీ విస్మరించకుండా సీట్లు ఇచ్చామని గుర్తు చేశారు.

మాల్లారెడ్డివి మునగచెట్టు ఎక్కించే మాటలు

మీడియా తన చుట్టూ ఉన్నప్పుడు మజాక్ చేస్తుండడం మల్లారెడ్డికి అలవాటేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈటలను మునగచెట్టు ఎక్కించి కిందపడేసేందుకే ఆయన గెలుస్తారని మల్లారెడ్డి అన్నారని తెలిపారు. మల్లారెడ్డి మాటలతో రాజేందర్ ఉబ్బితబ్బిబ్బయి ప్రచారాన్ని బంద్ పెడితే బీఆర్ఎస్ స్పీడ్ పెరుగుతుందని, తద్వారా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తాడంటూ మల్లారెడ్డి మాటల్లోని ఆంతర్యాన్ని బయటపెట్టారు. ఈటలను గతంలో రెండుసీట్లలో ఓడించామని, ఈసారి కూడా ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన నాయకులు పోటీ చేసిన స్థానాల్లోనే ఎక్కువ దృష్టి పెడతామని, వారిని ఓడించేందుకు కృషి చేస్తామని చెప్పారు. శారీరకంగా ఇబ్బంది పడుతున్నప్పటికీ రైతుల కోసం కేసీఆర్ పర్యటిస్తున్నారని, క్యాడర్‌లో ఉత్సాహం నింపుతున్నారని తెలిపారు. ఎన్నికల తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణం చేపడతామని, ప్రజా సమస్యలపై పోరాడతామని స్పష్టం చేశారు.

దేశ ప్రయోజనాల కోసం అంశాలవారీ మద్దతు

దేశానికి ఉపయోగం ఉంటుందనే జీఎస్టీ, నోట్ల రద్దుకు అప్పట్లో మద్దతు తెలిపామని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఓటు వేశామని, సీఏఏ, ఎన్ఆర్‌సీలకు అసెంబ్లీలో తీర్మానం చేశామని, విభజన చట్టంలోని హామీల గురించి కొట్లాడామని పేర్కొన్నారు. దళితుడు రాష్ట్రపతిగా, తెలుగువ్యక్తి ఉపరాష్ట్రపతిగా పోటీలో ఉంటే మద్దతు తెలిపామని పేర్కొన్నారు. బీజేపీకి తాము ఇచ్చింది అంశాలవారీ మద్దతు మాత్రమేనని పేర్కొన్నారు. చాలా బిల్లులకు కాంగ్రెస్ మద్దతు తెలిపిందని, అంతమాత్రాన ఆ రెండు పార్టీలూ ఒకటే అని అనలేమని చెప్పారు.

అక్కడ తిడుతూ ఇక్కడ మద్దతు

కాంగ్రెస్ నాయకులు కేరళ వెళ్లి తిడతారని, మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం కలిసి పనిచేస్తారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో సీపీంఎను రేవంత్‌రెడ్డి బండబూతులు తిట్టినా ఇక్కడ మాత్రం వారు కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తారని, అది వారికే చెల్లిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిటీ కేసీఆర్‌ను పిలిస్తే ఆయన హాజరవుతారని పేర్కొన్నారు. సిరిసిల్లలో సాంచాలు నడవక నలుగురు నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడోసారి గెలిచి ఉంటే మహారాష్ట్రలో పోటీచేసి ఉండేవారమన్న కేటీఆర్.. ఏపీలో మాత్రం ప్రాంతీయ పార్టీలే గెలవాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. అక్కడ జగన్ గెలుస్తారని తమకు సమాచారం ఉందని కేటీఆర్ తెలిపారు.

> 400 సీట్లు అంటూ మోదీ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నారు. బీజేపీకి 220 సీట్లకు మించి వచ్చే ప్రసక్తే లేదు. 2014లో దేశం మొత్తం మోదీ గాలి వీచినా తెలంగాణలో మాత్రం బీజేపీని బీఆర్ఎస్ అడ్డుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. -కేటీఆర్

> ఢిల్లీ లిక్కర్ స్కాం జరగలేదని, కేజ్రీవాల్ అరెస్ట్ అన్యాయమని రాహుల్‌గాంధీ అంటారు. మద్యం కుంభకోణం జరిగిందని, కవిత అరెస్ట్ న్యాయమేనని రేవంత్ అంటారు. ఒకే కేసులో అరెస్ట్ అయిన ఇద్దరిపై కాంగ్రెస్ పార్టీకి రెండు రకాల వైఖరి ఎలా ఉంటుంది. -కేటీఆర్

కడియంను ఎవరూ కాపాడలేరు

వరంగల్ ప్రజల హృదయాలను కడియం శ్రీహరి తీవంగా గాయపరిచారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా కడియంను కాపాడలేరని తేల్చిచెప్పారు. కడియం శ్రీహరి ఉద్యమ ద్రోహి అని, ఆయనకు కేసీఆర్ చాలా పదవులు ఇచ్చారని, చివరికి ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన చేసిన మోసాన్ని పార్టీ కార్యకర్తలు కూడా జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. కాకతీయ కళాతోరణాన్ని అధికారిక ముద్ర నుంచి తీసేస్తామన్న రేవంత్‌రెడ్డి వరంగల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వారందరికీ పాదాభివందనం

ఒక రాజకీయ పార్టీ 023 సంవత్సరాలు పూర్తి చేసుకోవడమంటే చిన్న విషయం కాదని కేటీఆర్ పేర్కొన్నారు. దేశ రాజకీయ చరిత్రలో ఒక ప్రాంతీయ పార్టీగా ప్రయాణం మొదలు పెట్టి, ఈ స్థాయికి చేరుకోవడమంటే మాములు విషయం కాదని అన్నారు. 24 ఏండ్లలో 14 సంవత్సరాలు ఉద్యమం, 10 ఏండ్లు ప్రభుత్వంలో ఉన్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారుందరికీ పాదాభివందనం చేస్తునట్టు చెప్పారు. వారు లేకపోతే తాము లేమని, వారు ఆనాడు చేసిన అసమాన పోరాటాలే ప్రభుత్వంలో రావడానికి, 33 జిల్లాల్లో పార్టీ వేళ్లనుకోవడానికి కారణమైందని వివరించారు. పిడికెడు మందితో జలదృశ్యంలో ప్రారంభమైన టీఆర్ఎస్.. తెలంగాణను సుజల దృశ్యంగా మార్చిందని పేర్కొన్నారు. మేధావులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువత, సబ్బండవర్గాలకు శిరసు వంచి ధన్యవాదాలు తెలుపుకొంటున్నట్టు చెప్పారు. మీరు చూపిన బాటలోనే ముందుకు నడుస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 3 నుంచి గత 144 రోజులుగా ప్రతి రోజు ఏదో ఒక సందర్భంలో కేసీఆర్‌ను తలుచుకోని వారు లేరని పేర్కొన్నారు. కేసీఆర్ మళ్లీ వస్తే బాగుంటదని ప్రజలు ఆలోచిస్తున్నారని చెప్పారు.

లోకం పోకడ



మన పార్టీ ప్రచార రథం సిద్ధం చేసాం సార్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	47.8°c	27.3°c
ఆదిలాబాద్	44.8°c	27.3°c
రంగారెడ్డి	43.5°c	22.8°c
నిజామాబాద్	43.4°c	28.5°c
ఖమ్మం	43.0°c	26.0°c
హైదరాబాద్	42.3°c	28.3°c
మెదక్	42.1°c	23.0°c
కరీంనగర్	42.0°c	28.0°c
వరంగల్	42.0°c	28.0°c
మహబూబ్‌నగర్	41.5°c	29.3°c

గ్యారెంటీలు అమలు చేసినట్టు నిరూపిస్తే పోటీ నుంచి తప్పకుంటా

కాంగ్రెస్ నేతలకు బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సవాల్

విద్యానగర్, ఏప్రిల్ 27: 'కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసినట్టు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా.. సమయం, తేదీ, వేదిక మీరే నిర్ణయించండి' అని కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించేదుకు యత్నిస్తున్నదని మండిపడ్డారు. శనివారం కరీంనగర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు మీడియాలో బ్రేకింగ్‌ల కోసం సవాళ్ల పేరిట నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామన్నారని, మేనిఫెస్టో బైబిల్, ఖురాన్, భగవద్గీత అని మోసం చేశారని నిప్పులు చెరిగారు. మరో కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ముస్లింల పార్టీ కాంగ్రెస్ అని.. హిందూత్వ టీం బీజేపీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్.. తెలంగాణ ఇంటి పార్టీ

- ప్రజాస్వామిక ఉద్యమాలకు బిక్స్సాచి
- రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపిన ఘనకీర్తి
- కేసీఆర్ బాటలో పునరంకితమవుతం
- ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్.. తెలంగాణ ఇంటి పార్టీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన గులాబీ జెండాను ఎగరవేశారు. అంతకు ముందు తెలంగాణ తల్లికి పూలమాల వేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణకంటూ ఒక గొంతు ఉండటం అవసరమని, తెలంగాణకంటూ ఉన్న ఒక ఇంటి పార్టీ బీఆర్ఎస్ అని, తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీ రామరక్ష అన్న నాటి జయశంకర్ సార్ మాటలు ఎప్పటికీ వాస్తవంగా నిలుస్తాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఏనాడూ విజయాలకు పొంగిపోదని, అపజయాలకు కుంగిపోదని తెలిపారు. 2001లో శూన్యంలాంటి వాతావరణంలో, అనేక ప్రతికూలతలు ఉన్నా చిమ్మ చీకటిలో ఒక చిన్న కాంతిరేఖలాగా జలదృశ్యంలో పార్టీని ప్రారంభించినట్టు తెలిపారు. బీఆర్ఎస్ సాధించుకున్న తెలంగాణకు సరైన నాయకత్వం కేసీఆర్‌దేనని గుర్తించిన ప్రజానీకం 2014లో తమ పార్టీకి అధికారం కట్టబెట్టారని కేటీఆర్ చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల పరిపాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశామని తెలిపారు. జాతీయస్థాయిలో మన ఆలోచనా విధానాన్ని తీసుకెళ్లాలని, తెలంగాణలో సాధించిన ప్రగతిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న ఉద్దేశంతోనే భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చి జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని వివరించారు.

ప్రజలకు పాదాభివందనం

బీఆర్ఎస్ పార్టీకి 24 యేండ్లు నిండుతున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, గులాబీ సైనికులు, ఆడబిడ్డలు, అఖండమైన ప్రేమను నింపిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన వందలాదిమంది తెలంగాణ అమరవీరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ రుణపడి ఉంటామని, కేసీఆర్ చూపిన బాటలో మరోసారి పునరంకితం అవుతామని కేటీఆర్ చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నే గోవర్ధన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ జైలు నుంచి విడుదలైన తర్వాత అడ్వకేట్ రాజేశంతో మాధవరావు

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్‌కు బెయిల్

- మాధవరావు విడుదలకు చొరవ చూపిన కేసీఆర్, కొప్పుల

ధర్మారం, ఏప్రిల్ 27: పోలీసుల అక్రమ కేసులో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ప్రధాన కార్యదర్శి సల్వాజీ మాధవరావుకు బెయిల్ వచ్చింది. శనివారం సాయంత్రం కరీంనగర్ జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. మార్చి 18న సల్వాజీ మాధవరావుపై యూత్ కాంగ్రెస్ నాయకుడు సోగాల తిరుపతి దాడి చేయడమే కాకుండా ఎస్సీ కులం పేరిట దూషించారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసిన తిరుపతిపై మాత్రం పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ నెల 25 వరకు కోర్టు రిమాండ్ విధించడంతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పార్టీ లీగల్ సెల్ చొరవతో మాధవరావుకు బెయిల్ వచ్చింది.

కమిటీయే లేదు.. పునరుద్ధరణ ఎట్లా?

- 'కాళేశ్వరం' బాగుపై సర్కార్‌కు ఏదీ శ్రద్ధ?
- ఎన్డీఎస్ఏ ఆదేశాల అమలుకు ఎస్డీఎస్‌వో తప్పనిసరి!
- స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ పటిష్టతపై స్పష్టత కరువు
- డైవర్షన్ ఉద్యోగులతోనే కొనసాగింపు
- మేలో కీలక అధికారుల ఉద్యోగ విమరణ
- నియామకాలపై నెలక్రితమే మార్గదర్శకాలు
- అయినా పట్టింపులేని రాష్ట్ర సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాలు జారీ అయ్యాకే కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరిస్తాం' అని కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెబుతున్నది. కానీ, ఆ మార్గదర్శకాల అమలు కోసం పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటులో అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఎన్డీఎస్ఏ ఆదేశాల అమలుతో పాటు పర్యవేక్షణ బాధ్యతలు చూడాల్సిన 'స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్‌వో)ను పటిష్టం చేయకుండా ఇప్పటికీ డైవర్షన్ ఉద్యోగులతోనే సరిపెడుతున్నది. వీరిలో ఇద్దరు కీలక అధికారులు వచ్చే మేలోనే విరమణ పొందనుండగా నియామకాలపై నెలక్రితమే ఎన్డీఎస్ఏ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఎవరిని నియమించాలనేదానిపై సిఫార్సులు కూడా చేసింది. అయినా ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగుకూడా వేయకుండా ప్రాజెక్టు పునరుద్ధరణపై అశ్రద్ధ చూపుతున్నది.

ఎన్డీఎస్‌వోలదే ముఖ్య భూమిక

ప్రాజెక్టుల నిర్వహణ, భద్రత కోసం డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 మేరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు అంచెల వ్యవస్థను ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా డ్యామ్‌ల భద్రతను పర్యవేక్షించేందుకు 'ఎన్డీఎస్ఏ'ను ప్రత్యేకంగా నెలకొల్పింది. ఆనకట్ట భద్రత విధానాల రూపకల్పన, నిబంధనల సిఫార్సు కోసం వివిధ విభాగాల్లో నిపుణులు, రాష్ట్రాల అధికారులతో కలిపి 'డ్యామ్ సేఫ్టీ జాతీయ కమిటీ'ని ఏర్పాటు చేసింది. జాతీయ ప్రాజెక్టుల భద్రత ప్రమాణాలను ఏటా రెండు సార్లు నిర్ధారించేందుకు 'డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్స్'ను ఏర్పాటు చేయాలి. ఇదే తరహా రాష్ట్రాలు సైతం తమ పరిధిలోని డ్యామ్‌ల భద్రత పర్యవేక్షణ, ఎన్డీఎస్ఏ మార్గదర్శకాల అమలు కోసం ఎస్డీఎస్‌వోలను ఏర్పాటు చేయాలి. సలహాలు, సూచనలు, సిఫార్సుల కోసం 'స్టేట్ డ్యామ్ సేఫ్టీ కమిటీ'లను, భద్రత, ఆడిట్ కోసం 'స్టేట్ డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్'ను నెలకొల్పాలి. ఇలా చట్టంలో మొత్తంగా ఎస్డీఎస్‌వోలదే కీలక భూమిక. ఏదైనా ప్రాజెక్టులో లోపాలను గుర్తిస్తే వాటి పునరుద్ధరణ బాధ్యత కూడా వీటిదే. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలు, ఆమోదం, పర్యవేక్షణలోనే పనులు కొనసాగించాలి. ఇందుకోసం డ్యామ్ సేఫ్టీ యాక్ట్, 2021లోని సెక్షన్ 21 ప్రకారం ఎస్డీఎస్‌వోలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

డైవర్షన్ ఉద్యోగులతోనే..

చట్టాన్ని అనుసరిస్తూ ఎస్డీఎస్‌వోను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. చీఫ్ ఇంజినీర్, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇద్దరు ఈఈలు, నలుగురు డీఈఈలు, ఎనిమిది మంది ఏఈఈలు, కార్యాలయం కోసం ఒక డీఈఈ, డ్రాయింగ్ డిస్బర్సింగ్ ఆఫీసర్, ఇద్దరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఏఈఈ), ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 10 మంది ఆఫీస్ సబార్డినేట్లతో ఎస్డీఎస్‌వోను నెలకొల్పాలి. దీని హెడ్ అకౌంట్‌ను కూడా ప్రత్యేకంగా నిర్వహించాలి. ఈ విభాగం డ్యామ్‌ల భద్రతను పర్యవేక్షిస్తూనే, క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు శిక్షణ కూడా ఇవ్వాలి. చట్టం అమల్లోకి వచ్చిన వెంటనే అప్పటికప్పుడు ఏర్పాటు చేసే పరిస్థితి లేక అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా కమిటీ ఏర్పాటు చేసింది. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగం కింద ఉన్న అధికారులనే డైవర్షన్ చేసి ఎస్డీఎస్‌వో బా